
సాక్షి
పల్నాడు
I
శనివారం। 12। ఆగస్టు। 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,514 క్యూసెక్కులు విడుదల చేశారు.



శ్రావణమాసం సారె

చేబ్రోలు: నిత్యానంద ఆశ్రమంలోని కన్యకాపర మేశ్వరి, శారదాదేవి అమ్మవార్లకు శుక్రవారం శ్రావణమాసం సారెను మహిళలు సమర్పించారు. సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు.



దుర్గమ్మ దర్శనం

విజయవాడ : దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

స్పందన కార్యక్రమం రద్దు

నరసరావుపేట: పల్నాడు కలెక్టరేట్‌లో ఈనెల 14వ తేదీ సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేశారు. 15న స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ ఎల్.శివ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డీబీటీ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి



నరసరావుపేట: డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎండీ కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వివిధ సంక్షేమ అధికారులతో బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమ్మఒడి, చేయూత, చేదోడు, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో తప్పకుండా ఈకేవైసీ చేయించాలన్నారు. డీబీటీ స్కీం వెల్ఫేర్ అసిస్టెంట్లు వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ఈడీలు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, డీజేబుల్ ఈడీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు అద్దంకి విద్యార్థులు




అద్దంకి: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పట్టణానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీవీ రత్నం చెప్పారు. ఈపోటీలు ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీలకు అద్దంకిలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన బీ శ్వేతారెడ్డి, ఎల్ హస్మిత, ఎస్ నాగూర్‌బీ, కే సెరాఅంజల్, ఏ లక్ష్మిప్రసన్న, కే అనూషా, ఎస్‌కే షబానా, ఎస్ అను, జీ రాజేశ్వరి, వీరు, బల్లికురవ కేజీబీవీ విద్యార్థులు జీ ఇజ్రాయేల్, డీవీపీ అంజిరెడ్డి ఎంపికైనట్లు చెప్పారు. స్థానిక గీతా మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి పి.రాంబాబు, చిన్ని మురళి, వెంకటకృష్ణారెడ్డి, ఎల్.అమరనాథ్, శ్యామ్ ప్రసాద్ హాజరయ్యారు.

మత్తు పదార్థ తయారీదారు అరెస్టు


గుంటూరు రూరల్: ఒక అపార్ట్‌మెంట్‌లో నిషేధిత మత్తు పదార్థాలను తయారు చేస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం శ్రీనివాసరావుపేటకు చెందిన వాసేపల్లి రామకృష్ణారెడ్డి, హైదరాబాద్‌లో నివాసం ఉండే అతని మేనల్లుడు శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరూ కలిసి లిక్విడ్ గంజాయిని మరగబెట్టి మెర్త్ అనే మత్తుపదార్థం తయారు చేసి విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని తెలుసుకున్నారు. లిక్విడ్ గంజాయిని సేకరించి మెర్త్ తయారీకి మహాలక్ష్మి బార్ ఎదురు సందులో ప్రకాష్ అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. అందులో గుట్టుచప్పుడు కాకుండా మెర్త్ తయారు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు రెక్కీ నిర్వహించి రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద కొద్ది మొత్తంలో నిషేధిత మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 864.70 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.1,400, గరిష్ఠ ధర రూ.2,800, మోడల్ ధర రూ.1,900 వరకు పలికింది.

ప్రకృతి వ్యవసాయం

- ఎస్సీ రైతులకు ఉచితంగా రూ.10 వేల కిట్ అందజేయనున్న ప్రభుత్వం
- కిట్‌లో 23 రకాల విత్తనాలతో పాటు వ్యవసాయ పరికరాలు
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- పల్నాడు జిల్లాలో 1,952 మందికి రూ.1.95 కోట్ల విలువైన కిట్లు పంపిణీ





రైతుకు ప్రకృతి వ్యవసాయ కిట్టును పంపిణీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్ (ఇన్‌సెట్‌లో) కిట్ బ్యాగ్ →

సాక్షి, నరసరావుపేట: వ్యవసాయాన్ని పండుగ చేసేలా రైతన్నకు భరోసా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అదే క్రమంలో ప్రకృతి వ్యవసాయానికి కూడా పెద్దపీట వేస్తోంది. సంప్రదాయ సేద్య విధానంలో కొన్నేళ్లుగా పెట్టుబడి వ్యయం భారమవుతోంది. అవగాహన లేమితో రసాయన ఎరువులు, పురుగు మందులను విచ్చలవిడిగా వాడడం వల్ల పంట ఉత్పత్తుల్లో వాటి అవశేషాలు ఉంటున్నాయి. ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని దశాబ్దాల క్రితం ఉన్న ప్రకృతి సాగు విధానమే ఇప్పుడు అవసరమైంది. సాగులో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, భూసారాన్ని కాపాడటం, నాణ్యమైన దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతులను ప్రకృతి సేద్యం వైపు మళ్లించేందుకు యత్నిస్తోంది. దీనిలో భాగంగా ఎస్సీ రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన ద్వారా రైతులకు ప్రత్యేకమైన కిట్లను అందజేస్తోంది. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కిట్ల పంపిణీని బుధవారం కలెక్టర్ శివశంకర్ ప్రారంభించారు.

ఎస్సీ రైతులకు లాభాల పంట

ప్రకృతి వ్యవసాయం వైపు ఎస్సీ రైతులను ప్రోత్సహించడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. సహజ సిద్ధ సేద్యంలో పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉంటుంది. రైతులకు నికర ఆదాయం లభిస్తుంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించకుండా గో ఆధారిత ఎరువులు, కషాయాలు వాడటం వల్ల నేల స్వభావం దెబ్బతినదు. వాతావరణ కాలుష్యం తగ్గడంతోపాటు రసాయన అవశేషాల్లేని ఆహార పంటలను ఉత్పత్తి చేయగలుగుతారు. ఇది ప్రజారోగ్యానికి మేలు చేస్తుంది. ప్రస్తుతం ప్రకృతిసిద్ధంగా పండించిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఫలితంగా గిట్టుబాటు ధర రైతులకు అందుతోంది.

కూరగాయ విత్తనాలూ అందజేత

పల్నాడు జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,952 మంది ఎస్సీ రైతులను ఈ పథకానికి అర్హులుగా ప్రాథమికంగా గుర్తించారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.10 వేల విలువజేసే ప్రకృతి వ్యవసాయ పరికరాలు, వస్తువులు, 23 రకాల విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం రూ.1.95 కోట్లు ఈ కిట్లకు ఖర్చు చేయనున్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం గుర్తించిన ఎస్సీ రైతులకు 8 ఫారమున్ ట్రోల్స్, స్టిక్కింగ్ ప్లాంట్స్ 30, టార్పాలిన్, 200 లీటర్ల డ్రమ్ము ఒకటి, వంద లీటర్ల డ్రమ్ములను రెండు అందజేస్తున్నారు. కొర్రలు, రాగులు, సజ్జలు, వేరుశనగ, మినుములు, జొన్న, మొక్కజొన్న, జీలుగు, పిల్లి పిసర, జనుము, పెసలు, కందులు, ఉలవలు తదితర విత్తనాలతో పాటు కిచెన్ గార్డెన్‌లో భాగంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయల విత్తనాలూ అందిస్తున్నారు.

ఉద్యమంగా ప్రకృతి సేద్యం

ప్రకృతి వ్యవసాయం ప్రజల ఆరోగ్యానికి, నేల పరిరక్షణకు ఎంతో ముఖ్యమైనది. మరోవైపు రైతులకు అధిక పెట్టుబడుల నుంచి విముక్తి కలుగుతుంది. ఈ కారణంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా ప్రోత్సహిస్తోంది. ఎస్సీ రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ.10 వేల విలువజేసే వ్యవసాయ సామగ్రి, 23 రకాల విత్తనాలను అందజేస్తోంది. రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడటంతోపాటు ఆరోగ్యంగా ఉండాలి.

–శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- మహిళా స్వయం సహాయక గ్రూపులకు వైఎస్సార్ సున్నావడ్డీ రూ.58 కోట్లు
- నమూనా చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటును వినియోగించుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో నాలుగో విడత సున్నా వడ్డీ నగదును జమ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోనసీమ జిల్లా అమలాపురం నుంచి శుక్రవారం లాంఛనంగా బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వర్చ్యువల్ విధానంలో పల్నాడు కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సున్నా వడ్డీ ద్వారా జిల్లాలో 41,400 స్వయం సహాయక సంఘాల్లోని 4,14,910 మందికి రూ.58.02 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వివరించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ సాయాన్ని ఎలా ఉపయోగించాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వయం సహాయక సంఘాల వృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సంఘాలు గ్రాసరీ మార్ట్స్ ఏర్పాటుకు ముందుకు వస్తే సహాయం అందిస్తామని వెల్లడించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే లబ్ధిదారులకు నమూనా చెక్కు అందించారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, జెడ్పీటీసీ సభ్యులు చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ చేయూతకు కృతజ్ఞతలు



మా గ్రూపునకు నాలుగో విడతగా రూ.12,600 జమకానున్నాయి. మా గ్రూపు సభ్యులు కిరాణా, శారీస్, ఐరన్ వంటి వ్యాపారాలు చేస్తున్నారు. సకాలంలో వడ్డీలు చెల్లిస్తున్నాం. గతంలో రూ.7 లక్షలు తీసుకోగా, ఇప్పుడు రూ.10 లక్షలు తీసుకున్నాం. మాకు సహాయం చేస్తున్న సీఎంకు సర్వదా రుణపడి ఉంటాం. కృతజ్ఞతలు.

– భూలక్ష్మి, 12వ వార్డు, ప్రకాష్‌నగర్, నరసరావుపేట

నియోజకవర్గాల వారీగా ఇలా..

నియోజకవర్గం	డ్వాక్రా గ్రూపులు	సభ్యులు	ప్రస్తుతం జమైన సున్నా వడ్డీ నగదు(రూ.కోట్లలో)
చిలకలూరిపేట	5307	53,950	7.60
గురజాల	5,982	59,820	8.67
మాచర్ల	6,425	64,250	8.76
నరసరావుపేట	5,036	50,390	7.33
పెదకూరపాడు	5,930	59,300	8.22
సత్తెనపల్లి	5,771	57,710	8.03
వినుకొండ	6,949	69,490	9.41

రైల్వే నిర్మాణాలు చేపట్టాలి

కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ అయోధ్యరామిరెడ్డి వినతి



రైల్వే మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి

పాత గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను త్వరగా ప్రారంభించాలని రాజ్యసభ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని ఎంపీ కలిసి రాష్ట్రంలోని పలు ప్రతిపాదనల గురించి వివరించారు. గుంటూరు–సికింద్రాబాద్ రైలుకు 'అనవేమ ఎక్స్‌ప్రెస్' పేరు పెట్టాలని కోరారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, మంగళగిరి, పొన్నూరు, తెనాలి, జగ్గయ్యపేట, విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాలలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద కొన్ని ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు బ్రాడీపేట్ ఫ్లై ఓవర్‌ను 1957లో రెండు లైన్ల వెడల్పుతో నిర్మించారని, ఆ స్థానంలో కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జిని 6 లైన్ల వెడల్పుతో పునర్నిర్మించాలని విన్నవించారు. మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ వద్ద కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి పరిధిలో కొత్త ఆర్వోబీలను నిర్మించాలని కోరారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పెదకాకాని గ్రామంలో ఆర్వోబీ నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. తెనాలి మండలం వైకుంఠపురం గ్రామంలో ఆర్వోబీని పునరుద్ధరించాలని కోరారు. చినరావూరు వద్ద రైల్వే గేటును పునరుద్ధరించాలని విన్నవించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని విజయవాడ–హౌరా లైన్ విజయవాడ–సికింద్రాబాద్ లైన్‌ల మధ్య ట్రాఫిక్ అంతరాయానికి అధికారులు పరిష్కారం చూపించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట రైల్వేస్టేషన్‌కు ప్యాసింజర్ రైలు మంజూరు చేయాలని విన్నవించారు.

ముగిసిన రోల్ బాల్ సౌత్‌జోన్ పోటీలు



ఎంపికైన చిన్నారులు

గుంటూరు(క్రీడలు): రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో జరుగుతున్న రోల్ బాల్ సౌత్‌జోన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. సంఘం కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 11 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 60 మంది చిన్నారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వీరిలో 20 మందిని ఈనెల 14, 15 తేదీల్లో కేరళలోని కొల్లంలో జరగనున్న సౌత్‌జోన్ నేషనల్స్‌కు పంపిస్తామని వెల్లడించారు. అనంతరం చిన్నారులకు స్టేడియం చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, ప్రతాప్, హరిబాబు తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

దళితుల ఆరాధ్యదైవం సీఎం వైఎస్ జగన్

- చంద్రబాబు ఎస్సీలను దగా చేశారు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా చినఏసోబు బాధ్యతల స్వీకారం



మాచర్ల కొత్త మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు బాధ్యతల స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వేదికపై ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: దళితుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ వారి ఆరాధ్య దైవంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. శుక్రవారం రాత్రి మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో కొత్త చైర్మన్‌గా మాచర్ల చిన ఏసోబు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలపు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ ఎస్సీలను చిన్నచూపు చూసిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబు హయాంలో దళితులను దగా చేశారని ధ్వజమెత్తారు. దళిత ఉద్యమకారులపై చంద్రబాబు అనేక కేసులు పెట్టి వేధించారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ కేసులన్నీ రద్దు చేశారని చెప్పారు. ఎస్సీ కులాలకు విడివిడిగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి జీవితాల్లో సీఎం వెలుగులు నింపారని కొనియాడారు. 2024లోనూ సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకునేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. డెప్యూటీ సీఎం, హోంశాఖ మంత్రితోపాటు అనేక పదవులను సీఎం జగన్ దళితులకు కట్టబెట్టారని పేర్కొన్నారు. ఆయన బాటలోనే నడుస్తూ పల్నాడు పులిబిడ్డ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా దళితుడికి పట్టాభిషేకం చేయడం సంతోషించదగిన పరిణామమన్నారు. మాచర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

దళితులకు ప్రాధాన్యమే ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) మాట్లాడుతూ దళితులకు ప్రాధాన్యం ఇవ్వడమే ధ్యేయంగా ప్రభుత్వంతోపాటు తాను పనిచేస్తున్నట్టు వివరించారు. ఆది నుంచి పిన్నెల్లి కుటుంబానికి ఎస్సీలు దన్నుగా ఉన్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో దళితుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తామని వెల్లడించారు. దుర్గి మార్కెట్ యార్డు చైర్మన్ పదవినీ ఎస్సీలకు కేటాయిస్తామని తెలిపారు. చంద్రబాబు దళిత ద్రోహి అని విమర్శించారు. అందుకే మళ్లీ సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

మళ్లీ వైఎస్ జగన్‌ను గెలిపించుకుందాం

వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు మాచర్లలో దుష్ట శక్తులు కుట్రలు చేస్తున్నాయని, అటువంటి విషయాలను పట్టించుకోకుండా ఏ ఒక్కరూ ఆవేశానికి గురికాకుండా 2024 టార్గెట్‌గా పనిచేద్దామని, సీఎం వైఎస్ జగన్‌ను, ప్రభుత్వ విప్ పీఆర్కేను మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు బూదాల మరియమ్మ, ఉప్పలపాటి జాని, కామనబోయిన కోటయ్య, అంజి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు, కొత్తమాసు పాండురంగారావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, యరబోతుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లాహిరి లాహిరి 'లాంచీలో'..

- కృష్ణానదిలో లాంచీ ప్రయాణం ప్రారంభం
- రాయపూడి ఫెర్రీకి కొత్తగా రెండు లాంచీలకు అనుమతి
- మూడున్నరేళ్ల సుదీర్ఘ విరామం తరువాత నదిలో రాకపోకలు



రాయపూడి వద్ద కృష్ణానదిలో లాంచీ ప్రయాణం

రాయపూడి(తాడికొండ): కృష్ణానదిలో మూడున్నరేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ప్రభుత్వం వసతులతో కూడిన లాంచీ ప్రయాణానికి అనుమతులు మంజూరు చేసింది. పాపికొండల యాత్రకు వెళ్లిన బోటు తిరగబడడంతో అప్పట్లో రాష్ట్రంలో పడవ ప్రయాణాలను ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా రాయపూడి రేవు మూతపడింది. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు రెండు లాంచీల రాకపోకలకు అనుమతి ఇవ్వడంతో లైఫ్ జాకెట్లు, ఫైర్ సేఫ్టీ సిస్టమ్, ఇతర పూర్తి వసతులతో కూడిన ప్రయాణం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. రాయపూడి రేవు నుంచి కృష్ణా జిల్లాకు వెళ్ళేందుకు 50 కిలోమీటర్లు దూరం తగ్గుతుండటంతో ద్విచక్రవాహనదారులూ లాంచీ ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తారు. టికెట్ ధరగా ఒక్కొక్కరికి రూ.50 లాంచీల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.50 వసూలు చేస్తున్నారు. లాంచీ ప్రయాణం పునరుద్ధరణతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకంగానూ ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

క్లుప్తంగా

ఉద్యోగం పేరుతో మోసం

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో ఓ యువతిని మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బ్రాడీపేట 6/13లోని ఓ లేడీస్ హాస్టల్‌లో నివసించే ఎ.త్రివేణి అనే యువతి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం కల్యాణివాసు అనే మహిళ ఫోన్‌లో త్రివేణిని సంప్రదించింది. వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగం ఇచ్చి కొంత వర్క్ చేసిన తరువాత డబ్బులు పంపితే పెద్ద ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపించింది. అది నమ్మిన త్రివేణి పలు విడతలుగా 4 లక్షలు చెల్లించింది. అనంతరం ఫోన్ నెంబర్ పనిచేయలేదు. ఆన్‌లైన్‌లోనూ ఎటువంటి సమాధానం రాలేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన త్రివేణి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యార్డుకు 26,410 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,882 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,410 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి 23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి 23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి 14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,634 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

జేజేలు పలికిన మాచర్ల ప్రజలు

- 10వేల మందితో భారీ ర్యాలీ
- ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌ల ఆధ్వర్యంలో జేజేలు
- మంత్రి సురేష్‌కు ఘన స్వాగతం



పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్, మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు పలువురు నేతలు

మాచర్ల: నలభై ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాచర్ల చిన ఏసోబును ఎంపిక చేయటంతో ఆయన ప్రమాణ స్వీకారం సందర్భంగా పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం నుంచే వేలాది మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు పట్టణానికి చేరుకోవడంతో వీధులన్నీ నిండిపోయాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం నుంచి రింగురోడ్డు వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్ పీర్కే, పీవీఆర్‌ల ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఆయన విగ్రహానికి పీఆర్కే, పీవీఆర్, చిన ఏసోబు, తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, బూదాల మరియమ్మ, అబ్దుల్ జలీల్ పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. మంత్రి ఆదిమూలపు సురేష్, పిఆర్కే, పీవీఆర్‌లకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు, కొత్తమాసు పాండురంగారావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, యరబోతుల శ్రీను, ఆయా మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, భారీ స్థాయిలో మంత్రి సురేష్, ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లకు జే జేలు కొట్టారు.

ఏమార్చి.. ఏటీఎం కార్డులు మార్చి..

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అమాయకులను ఏమార్చి.. ఏటీఎంల వద్ద కార్డులు మార్చి నగదు కాజేసే నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ పోలీసు ఆఫీసర్ (ఇన్‌చార్జ్) ఎం.బాలసుందరరావు, కొత్తపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్ బాషాలు వివరాలు వెల్లడించారు. గతనెల 14న బాపట్ల జిల్లా చినగంజాంకు చెందిన రాయిని శివలక్ష్మమ్మ ఆసుపత్రి పని నిమిత్తం గుంటూరుకు వచ్చి తన మనవరాలి ఏటీఎం తీసుకుని విజయటాకీస్ సమీపంలోని కొటాక్ మహీంద్ర బ్యాంక్ ఏటీఎం వద్దకు వెళ్లింది. డబ్బులు తీయటం రాకపోవటంతో అక్కడే నిలబడి ఉన్న వ్యక్తి సాయం కావాలా? అంటూ.. ఆమెను కోరగా, డబ్బులు తీసి పెట్టాలని కోరింది. ఏటీఎం లోపలికి వెళ్లి శివలక్ష్మమ్మ కార్డులో నుంచి రూ.10 వేలు డ్రా చేసి ఇచ్చిన ఆగంతకుడు ఆమెకు నకిలీ కార్డు ఇచ్చాడు. గత నెల 12వ తేదీన ఓల్డ్‌క్లబ్ రోడ్డులో ఆసుపత్రికి వచ్చిన ఒక మహిళను మోసం చేసి ఏటీఎం కార్డు ఏమార్చి అందులోని రూ.29 వేలు దొంగిలించాడు. గత నెల 14వ తేదీనే ఆర్‌ఎస్ బ్రదర్స్ పక్కన ఉన్న పంబాజ్ నేషనల్ ఏటీఎంలోనూ ఇదే విధంగా ఒక వ్యక్తిని మోసం చేసి 8 వేల నగదు అపహరించాడు. వరుస ఫిర్యాదు లు అందటంతో దృష్టి సారించిన పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీల ఆధారంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన జక్కా సోమరాజును నిందితుడిగా గుర్తించారు. సోమరాజును కొత్తపేట ఎస్‌ఐ ఎస్. శ్రీనివాసరావు సిబ్బంది చాకచక్యంగా పట్టుకుని విచారించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలసుందరరావు, ఎస్‌హెచ్‌వో అన్వర్‌బాషా

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి



మాట్లాడుతున్న న్యాయమూర్తి మధుస్వామి

నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణ ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి తెలిపారు. జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి మధుస్వామి మాట్లాడుతూ ర్యాగింగ్ అనాగరిక చర్యగా పేర్కొన్నారు. సహచర విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. చదువుపై శ్రద్ధ ఉన్న విద్యార్థి ర్యాగింగ్‌కు దూరంగా ఉంటాడనీ, చదువు పట్ల నిర్లక్ష్యం వహించే విద్యార్థి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి చట్టం చేతికి చిక్కుతాడని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, కళాశాలకు గౌరవం తీసుకవచ్చేలా జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన 2016 నుంచి ఇప్పటి వరకు ఒక్క ర్యాగింగ్ సంఘటన కూడా నమోదు కాలేదని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతారని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.పి.రాజు, మానసిక వైద్యులు డాక్టర్ సతీష్, కె.ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో పశ్చిమ గోదావరి జట్టు

- డబుల్ సెంచరీ చేజార్చుకున్న ప్రణీత్‌పవన్
- ఎదురీదుతున్న ప్రకాశం జట్టు



కె.ప్రణీత్‌పవన్, 199 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభమైన అండర్–16 బాలుర సెంట్రల్ జోన్ మూడు రోజుల తొలి టెస్ట్ మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టు ఆధిక్యంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోర్ రెండు వికెట్ల నష్టానికి 243 పరుగులతో రెండవ రోజు శుక్రవారం బ్యాటింగ్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 412 పరుగులకు ఆలౌట్ అయింది. తొలిరోజు 124 పరుగులతో అజేయంగా ఉన్న కె.ప్రణీత్‌పవన్ ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ చేజార్చుకొని 199 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద పెవిలియన్ దారి పట్టాడు. ప్రకాశం జట్టు బౌలర్లు జోష్వింత్‌కు మూడు వికెట్లు, ప్రణీత్, కె.వి.ఎస్.తేజరెడ్డి, గిరీష్‌రాయ్‌లకు రెండేసి వికెట్లు చొప్పున లభించాయి. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జిల్లా జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. జట్టులోని ఎం.మనీష్ 29, అక్షయ్ 11 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి. పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో ఆగస్టు 15వ తేదీన స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో శుక్రవారం వేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఏర్పాట్లకు సంబంధించి త్వరితగతిన పనులు పూర్తి చేయించేందుకు పలువురు జిల్లా అధికారులకు విధులను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గతేడాది కన్నా ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకల్లో పాటించాల్సిన ప్రోటోకాల్ విధానం, జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసు కవాతు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రసంగం, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు సత్కారం, విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ అధికారులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోల బహుకరణ, ప్రభుత్వ స్టాల్స్ సందర్శన, ముగింపు కార్యక్రమం అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

పరిశీలించిన జేసీ

నరసరావుపేట ఈస్ట్: స్వాతంత్య్ర వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకలను నిర్వహించనున్న సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంను శుక్రవారం అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. సభా వేదిక, వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ఊరేగింపు మార్గం, వాకింగ్ ట్రాక్, వీఐపీ లాంజ్, పార్కింగ్, బారికేడ్ల నిర్మాణం, ప్రజలు వీక్షించేందుకు ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరాజు, ఆర్డీఓ శేషిరెడ్డి, ఆర్ అండ్ బీ అధికారి రాజానాయక్, తహసీల్దార్ రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి ఎనలేని కృషి

- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు
- జగనన్న నేతృత్వంలో విశేష కృషి



మాట్లాడుతున్న అడపా శేషు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): కాపుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరులో కాపు సోదరుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై సూచనలు, సలహాలు తీసుకోవడం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతం నుంచి అన్ని రాజకీయపార్టీలు కూడా కాపులపై కుట్ర చేస్తున్నాయన్నారు. కానీ నేడు అలాంటి పరిస్థితులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర తిరగరాసి కాపులకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబుకి ఊడిగం చేస్తూ చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాపు నేస్తం ద్వారా 2 కోట్ల రూపాయలు అక్క, చెల్లెమ్మలకు ఇవ్వడం జరిగిందన్నారు. పవన్‌కు మాయమాటలు చెప్పి చంద్రబాబు వాడుకుంటున్నాడనీ, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. వారాహి, జనసేన కార్యాలయంతోపాటు పవన్ కల్యాణ్ మాట్లాడే మాటలు కూడా అతనివి కాదన్నారు. త్వరలోనే అన్ని జిల్లాల్లోనూ కాపులతో సమావేశం ఏర్పాటు చేసి కాపులను ఏకతాటిపైకి తెచ్చి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి గతంలో న్యాయం చేసిన ఘనత రాజశేఖర్‌రెడ్డిది అయితే నేడు ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వాన్ని బలపరుస్తూ రానున్న ఎన్నికల్లో కాపు సామాజిక వర్గం అంతా కూడా వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేసే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


హత్యకేసులో నిందితుడి అరెస్టు

పర్చూరు(చినగంజాం): తల్లిని చంపిన కేసులో కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను శుక్రవారం మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్, ఎస్‌ఐ ఎస్‌సీ ప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పర్చూరు మండలం కొత్తపాలేనికి చెందిన మద్దిన పేరమ్మ ఈనెల 5వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో ఉండగా ఆమె చిన్న కుమారుడు మద్దిన అంజయ్య వచ్చి ఆమె పేరు మీద ఉన్న రెండెకరాల పొలాన్ని అతడి పేరు మీద రాయమని గొడవపడ్డాడు. రాయకపోవడంతో పాటు ఆమెకు ఇవ్వాల్సిన రూ.4 లక్షల డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని ఆమెను చంపాలనే ఉద్దేశంతో గొడవ పెట్టుకున్నాడు. అనంతరం కత్తితో గాయపరిచాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి అంజయ్య పారిపోయాడు. రక్తగాయాలతో ఉన్న పేరమ్మను స్థానికులు చీరాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆగస్టు 8న మృతి చెందింది. హత్యాయత్నం కేసును హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. శుక్రవారం పర్చూరు వై జంక్షన్ వద్ద అంజయ్యను అరెస్టు చేసి, పర్చూరు కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. నిందుతుడికి 14 రోజులు రిమాండ్ విధించారు.

వెబ్ ఆప్షన్ సహాయక కేంద్రం ప్రారంభం

రేపల్లె: పాలిటెన్నిక్‌లో వెబ్ ఆప్షన్ ప్రక్రియ సహాయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు రేపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి డిప్లొమాలో ప్రవేశాల కోసం ఈ నెల 11 నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్‌ల ప్రక్రియ 14వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. పాలిసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులకు వెబ్ ఆప్షన్ నమోదు చేయటంలో తోడ్పాటునందించటం జరుగుతుందని వివరించారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



బల్లికురవ: పొలంలో పిడుగు పడటంతో ఓ మహిళ అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మన్యం చిన్నమ్మాయి(54) గ్రామం నుంచి కొప్పరపాడు వెళ్లే దారిలో తనకున్న రెండెకరాల పొలంలో బీర వేసుకుని జీవనం సాగిస్తోంది. వర్షం, పిడుగు పాటుకు బీరకాయలు కోస్తుండగా చనిపోయింది. భర్త నాగేశ్వరరావు పదేళ్ల క్రితం చనిపోయాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నమ్మాయి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.